సాక్షి
కాకినాడ
మంగళవారం । 2 । జనవరి । 2024



పట్టా పండగకు తేదీ ఖరారు

జేఎన్‌టీయూకే స్నాతకోత్సవానికి తేదీ ఖరారైంది. ఈ నెల 29వ తేదీన నిర్వహించేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు.

8లో




పదిండి ముందుకు

టెన్త్ పరీక్షల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆకాంక్షించారు.

8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 12,100 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు 3,800, సెంట్రల్ 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.85 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

రత్నగిరికి భక్తుల తాకిడి



స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అన్నవరం: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని రత్నగిరికి సోమవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలి వచ్చారు. సత్యదేవుని ఆలయం, వ్రత, విశ్రాంతి మండపాలు, ఆలయ ప్రాంగణం, భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు.

కన్నుల పండువగా నిత్య కల్యాణం

రత్నగిరివాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి నిత్యకల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా నిత్య కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకూ పండితులు స్వామివారి కల్యాణం జరిపారు. దీనిని అధిక సంఖ్యలో భక్తులు తిలకించి, పులకించారు. పండితులు నాగాభట్ల కామేశ్వరశర్మ, పాలంకి పట్టాభి, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రూ.50 వేల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి బ్రమర గౌరేశ్వరరావు, లక్ష్మి దంపతులు (గుండుగొలను) సోమవారం రూ.50 వేల విరాళం అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఈ విషయం తెలిపారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

కేంద్రమంత్రి రూపాల రాక రేపు



పురుషోత్తం రూపాల (ఫైల్)

సఖినేటిపల్లి: కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల బుధవారం పల్లిపాలెం రానున్నారు. గ్రామంలోని మత్స్యకారులతో ఆయన సమావేశమై, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్టు బీజేపీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు తెలిపారు.

● తుని తగవు

తమ్ముళ్ల డిష్యూం డిష్యూం

- నూతన సంవత్సర వేళ.. టీడీపీలో ఆధిపత్య పోరు
- యనమల బ్రదర్స్ వర్గాల మధ్య భగ్గుమన్న విభేదాలు
- పరస్పరం తన్నులాటలు.. పిడిగుద్దులు
- రాజేష్ చేతిలో తొండంగి టీడీపీ
- సహించలేకే కృష్ణుడి వర్గం దాడి
- ఉసిగొల్పారంటున్న రాజేష్ వర్గం





తుని మండలం ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడు వద్ద నూతన సంవత్సర వేడుకల్లో తన్నుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

కొత్త సంవత్సరం ఆరంభం రోజునే తునిలో తెలుగు తమ్ముళ్లు తన్నులాటలకు దిగారు. యనమల బ్రదర్స్ అనుచరులు రెండు వర్గాలుగా విడిపోయి.. డిష్యుం డిష్యుం అంటూ పిడిగుద్దులు కురిపించుకున్నారు.. తన కళ్ల ముందే తెలుగు 'తమ్ముళ్లు' అరుపులు, కేకలతో.. ముష్టిఘాతాలతో ఫైటింగ్‌కు దిగినా.. ఆ పార్టీ నేత యనమల రామకృష్ణుడు సైలెంటుగా ఉండిపోవడం చూపరులను విస్మయపరచింది.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తన వరకూ వస్తేనే కానీ తత్త్వం బోధపడదంటారు పెద్దలు. ప్రజాదరణ కోల్పోయి, అధికారానికి దూరమై ఏళ్లు గడుస్తున్నా పార్టీలో గ్రూపులను కట్టడి చేయలేని దుస్థితిని తెలుగుదేశం అగ్ర నేతలు ఎదుర్కొంటున్నారు. టీడీపీలో గ్రూపు రాజకీయాలకు ఆది గురువుగా విమర్శలు ఎదుర్కొనే శాసనమండలి ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుకు ఇప్పుడు దాదాపు అటువంటి పరిస్థితే ఎదురైంది. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన ఆయన.. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాపై ఆధిపత్యం కోసం.. ఇటు కాకినాడ మెట్ట ప్రాంతం, అటు కోనసీమలో గ్రూపులను పెంచి పోషిస్తూ వచ్చారు. టీడీపీ అధికారంలో ఉండగా జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చిన రాజప్ప, దివంగత నేతలు మెట్ల సత్యనారాయణ రావు, బొడ్డు భాస్కర రామారావులను గ్రూపులుగా చేసి, ఉమ్మడి జిల్లాపై పెత్తనాన్ని చెలాయించిన చరిత్ర రామకృష్ణుడు సొంతమనే వారు ఆ పార్టీలో కోకొల్లలు. ఇన్నేళ్ల పాటు తాను పెంచి పోషించిన గ్రూపు రాజకీయాలు.. తీరా సొంత నియోజకవర్గం తునిలో భగ్గుమనేసరికి రామకృష్ణుడికి దిక్కు తోచడం లేదనే చర్చ టీడీపీ వర్గాల్లో నడుస్తోంది.

రగులుతున్న కృష్ణుడి వర్గం

సొంత కుమార్తె దివ్యను తన రాజకీయ వారసురాలిగా చేసేందుకు.. మూడు దశాబ్దాలుగా తన వెంట నడిచిన వరుసకు సోదరుడైన యనమల కృష్ణుడిని బలవంతంగా టీడీపీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి రామకృష్ణుడు తప్పించారు. అధిష్టానం వద్ద ఉన్న పలుకుబడితో నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను దివ్యకు అప్పగించారు. ఆమెకు పార్టీలో ఎదురుండకూడదనే ఉద్దేశంతో కృష్ణుడిని వ్యూహాత్మకంగానే తప్పించారని ఆయన వర్గం కొంత కాలంగా రగిలిపోతోంది. దివ్యకు పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడంపై కినుక వహించిన కృష్ణుడు.. కొంత కాలం అలకబూనారు. రాజకీయంగా పక్క చూపులు చూశారు. ఆ సమయంలో నియోజకవర్గ బాధ్యతలను రామకృష్ణుడి సొంత సోదరుని కుమారుడు రాజేష్ తన భుజాన వేసుకున్నారు. విధి లేని పరిస్థితుల్లో కృష్ణుడు టీడీపీలో తిరిగి క్రియాశీలకంగా మారారు. పార్టీపై పెత్తనం కోసం ఆయన చేయని ప్రయత్నమంటూ లేదు. అప్పటికే దివ్య కనుసన్నల్లో నియోజకవర్గ బాధ్యతలను కృష్ణుడు చూస్తున్నా.. టీడీపీ తొండంగి మండల బాధ్యతలు మాత్రం రాజేష్ చేతుల్లోనే ఉన్నాయి. ఒకప్పుడు నియోజకవర్గం మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్న కృష్ణుడి వర్గానికి ఇది అవమానంగానే అనిపించింది. దీంతో ఆ వర్గం సమయం కోసం వేచి చూస్తోంది.

ముందస్తు వ్యూహమేనా..!

రాజేష్‌ను ఎంత మాత్రం భరించలేని కృష్ణుడు నయాన భయాన ఆయనను పార్టీకి దూరం చేసేందుకు కొంతకాలం నుంచి ఎత్తుగడలు వేస్తున్నారు. దీనిలో భాగంగానే తొలి ప్రయత్నంగా సోమవారం జరిగిన నూతన సంవత్సర వేడుకలను వేదికగా చేసుకున్నారు. రామకృష్ణుడు కళ్లెదుటే రచ్చరచ్చ చేశారు. ముందస్తు వ్యూహంలో భాగంగానే కృష్ణుడు తన అనుచరులతో రాజేష్‌పై దాడి చేయించారని టీడీపీలో విస్తృతమైన చర్చ జరుగుతోంది.

తన్నుకున్నారిలా..

తుని మండలం ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడు వద్ద సాయి వేదికలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఇందులో యనమల రామకృష్ణుడు, దివ్యలకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు పలు గ్రామాల నుంచి తెలుగు తమ్ముళ్లు వచ్చారు. వారు వరుస క్రమంలో వెళ్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అదే సమయంలో రామకృష్ణుడి సొంత అన్న కుమారుడు రాజేష్ అక్కడకు చేరుకున్నారు. రామకృష్ణుడిని, దివ్యను కలిసేందుకు క్యూతో ప్రమేయం లేకుండా వెళ్లేందుకు ప్రయత్నించారు. అదను కోసం వేచి ఉన్న కృష్ణుడి వర్గీయులు దీనిని అవకాశంగా మలచుకున్నారు. అందరూ క్యూలోనే రావాలంటూ అక్కడున్న వారిని అప్పటికే వారు కట్టడి చేస్తున్నారు. ఈ సమయంలో రాజేష్ క్యూలో కాకుండా నేరుగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో అతడిని కృష్ణుడి వర్గం లక్ష్యంగా చేసుకుని ఒక్కసారిగా దాడులకు దిగింది. రాజేష్‌పై ఆయన సొంత చిన్నాన్న రామకృష్ణుడు, దివ్య సమక్షంలోనే పిడిగుద్దులతో ఈ దాడి జరిగింది. అయినప్పటికీ రామకృష్ణుడి అనుచరులు కిమ్మనకుండా ఉండిపోయారు. ఇరు వర్గాలకూ సర్ది చెప్పలేక, వారిని కట్టడి చేయలేక నిర్లిప్తంగా చూస్తూ ఊరుకుండిపోయారు. ఆయన సైలెంటుగా ఉండిపోవడానికి కృష్ణుడు దూరమైతే రాజకీయంగా ఇబ్బంది పడతామనే భయం తప్ప మరొకటి కారణం కాదని పలువురు అంటున్నారు. కుమార్తె దివ్య ఇన్‌చార్జిగా ఉన్న సొంత నియోజకవర్గం తునిలోనే కళ్లెదుటే ఇంత జరిగినా.. చివరకు ఇరువర్గాలను సముదాయించడానికి తలప్రాణం తోకకొచ్చినట్టయ్యిందని అంటున్నారు. ఇన్నేళ్లూ పార్టీలో గ్రూపులను ప్రోత్సహించిన యనమల.. రక్త సంబంధీకులు, దాయాదుల పోరు, గ్రూపు రాజకీయాలు భగ్గుమనడంతో.. వాటి ప్రభావాన్ని స్వయంగా రుచి చూశారని టీడీపీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు.

జిల్లా మరింతగా పురోగమించాలి

- కలెక్టర్ కృతికా శుక్లా
- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



కలెక్టర్‌కు హ్యాపీ న్యూ ఇయర్ చెబుతున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: నూతన సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లోనూ మరింతగా పురోగతి సాధించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆకాంక్షించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆనంద నిలయం వసతి గృహం విద్యార్థులు, ఉమా మనోవికాస కేంద్ర దివ్యాంగులతో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఆమెకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, సిబ్బంది, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కృతికా శుక్లాకు పండితులు వేదాశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.



ఆనంద నిలయం విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కొత్త సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలి



మంత్రి దాడిశెట్టి రాజాకు వేదాశీస్సులు అందిస్తున్న పండితులు

తుని: నూతన ఆంగ్ల సంవత్సరంలో ప్రజలు మరింత సంతోషంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఎస్.అన్నవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అభిమానులు సోమవారం నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను మంత్రి రాజా కట్ చేసి, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నవరం, తలుపులమ్మ తల్లి దేవస్థానాల పండితులు వేదాశీర్వచనాలు, ఈఓలు ప్రసాదాలు అందజేశారు. జిల్లాకు చెందిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు మంత్రి రాజాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలూ సంతోషంగా ఉన్నారని అన్నారు. భవిష్యత్‌లోనూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పెరికి, మాల కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు పురుషోత్తం గంగాభవాని, పెదపాటి అమ్మాజీ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సభ విజయవంతం చేయాలి

- కలెక్టర్ కృతికా శుక్లా
- రేపు కాకినాడకు ముఖ్యమంత్రి జగన్ రాక
- సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ పర్యటన, సభను విజయవంతం చేయాలని, ఇందుకు అనుగుణంగా పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం జగన్ బుధవారం కాకినాడ రానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ క్రీడా మైదానంలో హెలిప్యాడ్ వద్ద బారికేడ్ల ఏర్పాటు, వైద్య శిబిరం, స్పందన కౌంటర్, ప్రజాప్రతినిధులు వేచి ఉండే వీఐపీ స్టాల్స్ ఏర్పాటు పనులను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ పర్యటన సందర్భంగా వివిధ శాఖల అధికారులకు నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ క్రీడా మైదానం నుంచి రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానం వరకూ సీఎం రోడ్ షో, ఇతర ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పలు సూచనలు చేశారు. అనంతరం రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద జరుగుతున్న పనులను, సభకు లబ్ధిదారుల తరలింపు, మీడియా పాయింట్, పబ్లిక్ గ్యాలరీ, స్టాల్స్ ఏర్పాటు తదితర పనులను ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఏపీ భూదాన పరిషత్ చైర్మన్ తాడి విజయభాస్కరరెడ్డి తదితరులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ రంగబాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, డీఎస్పీ కె.మురళీకృష్ణారెడ్డి, కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌ఓ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు క్యూరింగ్‌లు ప్రారంభం

- 55 వేల ఎకరాల్లో వర్జీనియా సాగు
- 49 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి
- 65 మిలియన్ల కిలోలు వస్తుందని అంచనా



దేవరపల్లి మండలం సంగాయగూడెంలో ఆశాజనకంగా ఉన్న పొగాకు తోట



సంగాయగూడెంలో క్యూరింగ్ చేసిన పొగాకు


దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా సాగు చేస్తున్న వర్జీనియా పొగాకు క్యూరింగ్‌లు ప్రారంభమయ్యాయి. అక్టోబర్‌లో వేసిన తోటలు పక్వానికి రావడంతో రైతులు ఆకులు రెలిచి, క్యూరింగ్ చేస్తున్నారు. క్యూరింగ్ చేసిన పొగాకు రంగులు ఆశాజనకంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. మిచాంగ్ తుపాను వల్ల పొగాకు రంగు, నాణ్యత దెబ్బ తింటాయని రైతులు భయపడ్డారు. అయితే, తరువాత వాతావరణం అనుకూలించడంతో తోటలు క్రమంగా కోలుకుంటున్నాయి. సంక్రాంతి నాటికి పొగాకు రెలుపులు, క్యూరింగ్‌లు ముమ్మరంగా జరుగుతాయని రైతులు చెబుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంతో పాటు ఏలూరు జిల్లాలోని ఉత్తర తేలిక నేలల్లో (ఎన్ఎల్ఎస్) పండించిన పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటోంది. బ్రెజిల్, జింబాబ్వే, రష్యా, అమెరికా వంటి దేశాల్లో పండిస్తున్న పొగాకుకు దీటుగా దాదాపు 60 ఏళ్లుగా ఇక్కడి రైతులు పొగాకు పండిస్తున్నారు. అక్టోబర్ నుంచి మార్చి వరకూ పొగాకు సాగు జరుగుతుంది. పండించిన పొగాకును క్యూరింగ్ చేసి, నాలుగు గ్రేడ్‌లుగా విభజించి, బేళ్లుగా కట్టి వేలం కేంద్రాల్లో విక్రయిస్తారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకూ పొగాకు కొనుగోళ్లు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 170 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తికి కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. ఇందులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉత్తర తేలిక నేలల్లో 49 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అయితే మిచాంగ్ తుపాను ముందు వరకూ పంట ఆశాజనకంగా ఉండటంతో 65 నుంచి 68 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని అధికారులు, ట్రేడర్లు అంచనా వేశారు. తుపానుకు దాదాపు 10 వేల ఎకరాల్లో పొగాకు తోటలు దెబ్బ తినడంతో ఉత్పత్తి తగ్గుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టడం, వాతావరణం పొడిగా ఉండటంతో తుపాను వల్ల పాక్షికంగా దెబ్బ తిన్న తోటలు ఇప్పుడిప్పుడే నిలబడుతున్నాయని రైతులు తెలిపారు. పూర్తిగా దెబ్బ తిన్న తోటలను దున్ని, కొత్తగా నాట్లు వేస్తున్నారు.

వేలం కేంద్రం	సాగు విస్తీర్ణం (హెక్టార్లు)	రైతులు	బ్యారన్లు
దేవరపల్లి	3,655	2,909	2,491
గోపాలపురం	4,048	2,659	2,190
జంగారెడ్డిగూడెం-1	4,490	2,877	2,407
జంగారెడ్డిగూడెం-2	4,335	2,760	2,608
కొయ్యలగూడెం	4,443	2,892	2,539

20,971 హెక్టార్లలో పొగాకు సాగు

మన జిల్లాతో పాటు ఏలూరు జిల్లాలో ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి 20,971 హెక్టార్లలో పొగాకు సాగు జరుగుతోంది. మొత్తం 14,097 మంది రైతులు దీని సాగు చేస్తున్నారు. 12,235 బ్యారన్ల రిజిస్ట్రేషన్లు చేశారు.

పొగాకు రంగులు ఆశాజనకం



పొగాకు రంగులు ఆశాజనకంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో ముందుగా వేసిన తోటల రెలుపులు, క్యూరింగ్‌లు జరుగుతున్నాయి. ఈ ఏడాది 55 వేల ఎకరాల్లో పొగాకు సాగు జరుగుతోంది. తుపానుకు దెబ్బ తిన్న తోటలు కొంత వరకూ నిలదొక్కున్నాయి. తోటల ఎదుగుదల బాగుంది. పరిమితికి లోబడి పంట వేసి, అధిక దిగుబడులు సాధిస్తే సాగు లాభసాటిగా ఉంటుంది. పంటకు అవసరమైన అన్ని రకాల ఎరువులనూ రైతులకు సరఫరా చేశారు.

– ఎం.ఆదిశేషయ్య, ఆర్ఎం, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

సమష్టి కృషితోనే వర్సిటీ అభివృద్ధి



జేఎన్‌టీయూకే డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమష్టి కృషితోనే వర్సిటీ అభివృద్ధి చెందుతుందని జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వీసీ అతిథి గృహంలో వర్సిటీ 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, గత ఏడాది రాష్ట్రంలోని అన్ని వర్సిటీ వీసీల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించి, ప్రశంసలు పొందామన్నారు. వర్సిటీకి న్యాక్ ఎ+, ఎన్‌బీఏ గుర్తింపు వల్ల యూజీసీ నుంచి నిధులు వస్తాయని, తద్వారా అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. వర్సిటీలో దాదాపు రూ.18 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైన్ల పనులు 50 శాతం పూర్తి చేశామని, వీటిని ఈ ఏడాది పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో స్టేడియంలో రూ.4 కోట్లతో 30 గదులతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది అత్యధికంగా రూ.35 లక్షల ప్యాకేజీతో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని చెప్పారు. ప్రతి 3 నెలలకు ఒక క్యాలెండర్ రూపొందించి, పనుల పురోగతిపై సమీక్షిస్తున్నామని, ఈ విధానం ద్వారా గత ఏడాది ప్రగతి కనిపించిందని అన్నారు. పీజీ హాస్టల్ భవనం నిర్మాణం ఈ ఏడాది పూర్తి చేస్తామమన్నారు. అనంతరం ఆయన సతీమణి అరుణ మిహిర, రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డీఏఏ సాయిబాబు, డీఏపీ వెంకటరెడ్డి సమక్షంలో వర్సిటీ డైరీ క్యాలెండర్ ఆవిష్కరించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగ్గంపేట: రోడ్డు ప్రమాదంలో **యువకుడు మృతి** చెందగా ఇద్దరికి గాయాలైనట్టు **జగ్గంపేట ఎస్సై** నాగార్జునరాజు తెలిపారు. రామ**వరం గ్రామానికి** చెందిన కొండేపూడి నవీన్ (18) **ఆదివారం రాత్రి** 11 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన సింగర్ల మహేష్‌బాబు, కళ్యాణం చిన్న మరిడయ్యలతో కలిసి న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా బిర్యానీ ప్యాకెట్ల కోసం జగ్గంపేటకు బయలుదేరారు. ముగ్గురు కలిసి మోటార్ సైకిల్‌పై రామవరం డివైడర్ వద్ద జగ్గంపేట వైపుకు వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా విజయవాడ వైపు నుంచి విశాఖ వైపు వేగంగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న నవీన్ రోడ్డుపై పడిపోవడంతో లారీ అతని తలపై నుంచి దూసుకుపోవడంతో తల నుజ్జు నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మహేష్ బాబు, చిన్న మరిడయ్యను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు. మృతుడు జగ్గంపేట హైస్కూల్లో 8వ తరగతి చదువుకుని తల్లితండ్రులతో వ్యవసాయం పనులు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

శ్రీచక్రానికి లక్ష చామంతి పూజ


కొత్తపేట ఏనుగులమహల్ శ్రీచక్రానికి లక్ష చామంతులతో పూజ

కొత్తపేట: స్థానిక ఏనుగులమహల్ గ్రామంలో వేంచేసిన రాజరాజేశ్వరిదేవి (శ్రీచక్రా మహామేరు యంత్రం)కి లక్షచామంతి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చకుడు వివేకవర్ధన్ శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, లక్ష చామంతులతో భక్తులు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన విఘ్నేశ్వరాలయం


స్వామి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

అయినవిల్లి: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు జరిపారు. స్వామివారి ఆలయాన్ని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి అన్నదాన సత్రంలో అన్నప్రసాదం స్వీకరించారు.

పట్టా పండగకు తేదీ ఖరారు

- జేఎన్‌టీయూకే 10వ స్నాతకోత్సవానికి సన్నాహాలు
- ఈ నెల 29న నిర్వహణకు ఆమోదం తెలిపిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- 20 వేల ఓడీలు, 60 పీహెచ్‌డీలు, 24 బంగారు పతకాలు ప్రదానం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


జేఎన్‌టీయూకే

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ 10వ స్నాతకోత్సవానికి తేదీ ఖరారైంది. ఈ నెల 29వ తేదీన నిర్వహించేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలపడంతో అధికారులు ఏర్పాట్లకు సన్నద్ధమవుతున్నారు. ప్రముఖుల చేతుల మీదుగా సంప్రదాయ వస్త్రధారణలో పట్టా(ఒరిజనల్ డిగ్రీ) అందుకోవాలని కలలు కంటున్న విద్యార్థులు స్నాతకోత్సవ తేదీ ఖరారు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాదీ క్రమం తప్పకుండా వర్సిటీ నిర్వహించాల్సిన వేడుకలు కోవిడ్ నేపథ్యంలో రెండేళ్ల పాటు నిర్వహించలేకపోగా అప్పటి వీసీ పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో క్రమేణా వాయిదా పడుతూ వచ్చింది. చాలా వర్సిటీలు కోవిడ్ సమయంలో పట్టాలు పంపిణీ చేసినా జేఎన్‌టీయూకే మాత్రం ముందుకురాలేదు. దీంతో బీటెక్, ఎంటెక్‌తో పాటు పీహెచ్‌డీల ఒరిజనల్ పట్టాలు, ఆయా సబ్జెక్టుల్లో ప్రతిభచూపిన వారికి ప్రతి ఏడాదీ అందజేసే బంగారు పతకాలు తీసుకోవాలని కలలుకన్న విద్యార్థులకు నిరాశే మిగిలింది. 2021 అక్టోబర్‌లో వీసీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు 2022లో, 8,9వ స్నాతకోత్సవాలు గత ఏడాది మే 31 నెలలో నిర్వహించారు. 10వ స్నాతకోత్సవం ఈ నెల 29న నిర్వహిస్తున్నారు.

ఐదు జిల్లాల్లో 20వేల మంది దరఖాస్తు

స్నాతకోత్సవం ద్వారా వర్సిటీకి అనుబంధంగా ఉన్న పాత ఉమ్మడి ఐదు జిల్లాల్లో ఇంజినీరింగ్, ఫార్మశీ, మేనేజ్‌మెంట్ విభాగ విద్యార్థులు 20వేల మంది ఉండగా ఇప్పటి వరకూ ఐదువేల మంది పట్టాలకు దరఖాస్తు చేసుకున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



వేడుకల నిర్వహణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. విద్యార్థి జీవితంలో మధురానుభూతిగా నిలిచే పట్టాల ప్రదానోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తాం. పీహెచ్‌డీ, బంగారు పతకాలు, ఓడీలు అందజేస్తాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, జేఎన్‌టీయూకే వీసీ

అందరూ సేవా కార్యక్రమాలు చేయాలి

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు


కల్యాణ మంటపాన్ని ప్రారంభిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

పిఠాపురం: గ్రామాల్లో ఉండే ఆలయాల పరిరక్షణతో పాటు అందరు సేవా కార్యక్రమాలు చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రజలకు సూచించారు. ఆయన సోమవారం గొల్లప్రోలు మండలం ఏ మల్లవరంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం వద్ద నిర్మించిన కల్యాణ మంటపాన్ని ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత కడింశెట్టి కుమార భాస్కరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఉమర్ ఆలీషా


సభలో ప్రసంగిస్తున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవుడు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విలువలతో సమాజంలో నడుచుకోవాలని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. నూతన సంవత్సర వేడుకలలో భాగంగా సోమవారం శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక నూతన ఆశ్రమంలో జరిగిన సభలో ఆయన ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. అంతకుముందు ఆయన జ్యోతి వెలిగించి సభను ప్రారంభించారు. వ్యవసాయం నిర్వహిస్తూ రైతు దేశానికి ఎలా వెన్నెముకగా ఉన్నాడో అదే విధంగా ఆధ్యాత్మిక జ్ఞానమనే పంట పండిస్తూ శాంతి, సుస్థిరత నెలకొల్పే మహత్తరమైన జ్ఞానయజ్ఞం శతాబ్దాల కాలంగా పీఠంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పంచభూత మయుడైన మానవుడు పంచ భూతాలైన భూమి, ఆకాశం, అగ్ని, నీరు, గాలి కలుషితం కాకుండా చూడాలన్నారు. పంచ భూతాల సమతుల్యత కాపాడడానికి ప్రతీ ఒక్కరు మూడు మొక్కలు నాటాలని సూచించారు. నా మొక్క నా శ్వాస కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. పంచ భూతాల రూపంలో ప్రాణం మనలోనే ఉందని, మన ప్రాణానికి హాని లేకుండా కాపాడుకోవాలంటే ప్రతీ ఒక్కరు మూడు మొక్కలు నాటి పరిరక్షించుకోవాలని ఆయన భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారుడు ప్రముఖ కవి తల్లావఝ్జల పతంజలి శాస్త్రి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పంచభూతాల పరిరక్షణలో శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సేవలు, కార్యక్రమాలు అభినందనీయమని, ఆచరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.రాంప్రసాద్, ఏవీవీ సత్యనారాయణ, పింగళి ఆనంద్‌కుమార్, ఎన్‌టీవీ ప్రసాద్ వర్మ, అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి.

పదిండి ముందుకు

- జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు
- టెన్త్ విద్యార్థుల స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు తదితరులు

కాకినాడ సిటీ: ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆకాంక్షించారు. సోమవారం సాయంత్రం పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ప్రచురించిన స్టడీ మెటీరియల్‌ను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలతలతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం లాగే 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 52 వేల మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇంగ్లిషు, తెలుగు మీడియంల వారీగా జిల్లా ప్రజాపరిషత్ సాధారణ నిధుల నుంచి తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్ సహాయంతో చదువులో మరింత రాణించి 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రాష్ట్రంలో మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని జిల్లాలను అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాల్సిందిగా కోరారు. ఈ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు వెంటనే పంపిణీ చేయించి, పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా కృషి చేయాల్సిందిగా జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.రమణారెడ్డిని చైర్మన్ వేణుగోపాలరావు కోరారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ. రమణారెడ్డి, జిల్లా ప్రజాపరిషత్ పరిపాలనాధికారులు, ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాండూరి శ్రీనివాసు, ఇతర జిల్లా పరిషత్ సిబ్బంది హాజరయ్యారు.

వాడపల్లి వెంకన్న సన్నిధిలో భక్తజన సందోహం

స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు


క్యూ లో భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం స్వామివారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని పూలతో, ఆభరణాలతో అలంకరించారు. ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారికి సువర్ణ పుష్పార్చన, దివ్య అలంకరణ, నీరాజన మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామివారికి నిత్యకల్యాణాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ నెల 14న ధనుర్మాసం చివరిలో భోగి పర్వదినం సందర్భంగా గోదాదేవి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవాల్లో పాల్గొనాలంటే 08855–271888 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ క్షేత్రపాలకుడు శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవ స్వామి, ఉమా కమండలేశ్వరస్వామి, ఆత్రేయపురంలో వేంచేసియున్న బాలా త్రిపుర సుందరీ రాజరాజేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలతో పాటు కనక మహాలక్ష్మి, మల్లమ్మ ఆలయాలను భక్తులు దర్శించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

ఆదర్శ మానవ సంబంధాలకు దర్పణం రామాయణం


సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆదర్శ మానవ సంబంధాలకు రామాయణం దర్పణమని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. సోమవారం హిందూ సమాజంలో ఆయన 20వ రోజు ప్రవచనాన్ని కొనసాగించారు. పంచవటి వద్ద లక్ష్మణుడు నిర్మించిన ఆశ్రమాన్ని చూసి, రాముడు సంప్రీతి చెంది "తండ్రి లేని లోటు తెలియకుండా నీవు సేవలు అందిస్తున్నా"వని సోదరునితో చెబుతాడు. నాటి హేమంత ఋతువును వర్ణిస్తూ రాముడు భరతుని స్మరించుకుంటాడు. ఈ చలికాలంలో భరతుడు రాజ్యభోగాలను వదలి, నేలపై నిద్రిస్తూ, తాపస వృత్తిలో ఎలా ఉన్నాడో అని రాముడు ఆవేదన వ్యక్తం చేస్తాడు. భరతుని వంటి ఉత్తమపుత్రునికి కైకేయి వంటి క్రూరురాలు ఎలా తల్లి అయిందో అని లక్ష్మణుడు వ్యాఖ్యానిస్తే, రాముడు అడ్డు చెబుతాడు. కైకేయిని నిందించరాదని హితవు చెబుతాడు. రామభక్తులు పరులను నిందించరాదు అని మనం గ్రహించాలని సామవేదం అన్నారు. గంగాతీరంలో శివపార్వతుల వలె సీతారాములు ఉన్నారు, లక్ష్మణుడు నందీశ్వరుని వలె ఉన్నాడని వాల్మీకి మహర్షి వర్ణించారు. శివకేశవ భేదం తగదని సామవేదం అన్నారు. ఆ సమయంలో రామకథను మలుపు తిప్పిన శూర్పణఖ ప్రవేశించింది. విశాల నేత్రాలు గల రాముని వికృత నేత్రాలు గల శూర్పణఖ చూసింది, యవ్వనంలో ఉన్న రాముని వృద్ధురాలయిన శూర్పణఖ చూసింది. ఆమె ఏనాటిదో? రాముడు అబద్ధం చెప్పడు, రాముని వద్ద నిలబడిన వారు అబద్ధం చెప్పలేరు. శూర్పణఖ తాను రాక్షస స్త్రీనని, రావణుని సోదరినని చెబుతుంది. రాముడు తాము వనాలకు ఎందుకు వచ్చారో వివరిస్తాడు. బాలకాండలో రాక్షస సంహారానికి విశ్వామిత్ర మహర్షి వెంట వచ్చిన రామునికి అరణ్యకాండలో మునులతో మైత్రీబంధం మరింత బలపడుతుందని సామవేదం వివరించారు. మహర్షులు ఉపదేశించిన బాటలోనే రాముని వనవాసం సాగిందని, పంచవటికి చేరుకునే సమయానికి వారి వనవాసంలో అధికభాగం పూర్తి అయిందని సామవేదం అన్నారు.





రత్నగిరిపై నూతన సంవత్సర వేడుకలు


ఈవో రామచంద్రమోహన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ సిబ్బంది దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో కె.రామచంద్రమోహన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో కె.రామచంద్రమోహన్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. కొత్తగా రూ.85 లక్షలతో టోల్‌గేట్ వద్ద నుంచి రత్నగిరికి సుమారు 400 మెట్లతో కొత్త దారిని నిర్మిస్తామన్నారు. దేవస్థానంలో క్యూ వ్యవస్థను పటిష్ట పరచి భక్తులకు సులభంగా దర్శనం అయ్యేలా చేస్తామన్నారు. క్యూ ల మధ్యలో భక్తులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు ఏర్పాటు చేస్తామని వివరించారు. స్వామివారి నూతన ఆలయానికి స్వర్ణతాపడం పనులకు త్వరలోనే బ్యాంక్ అకౌంట్ ఏర్పాటు చేసి దాతల నుంచి విరాళాలు సేకరిస్తామన్నారు. అనంతరం దేవస్థానం చైర్మన్, ఈవోలు రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రతిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరాముని అక్షతలతో శోభాయాత్ర


శ్రీరాముని పూజ అక్షతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ): శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షతలను కాకినాడలో ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య శర్మ తెలిపారు. సోమవారం నగరంలో పూజా అక్షతలతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్, వివిధ క్షేత్రాల సంయుక్త ఆధ్వర్యంలో అక్షతల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులంతా ఐక్యంగా పోరాడాలి


భీమా కోరేగావ్ స్మారక స్థూపం వద్ద మృతవీరులకు నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: భీమా కోరేగావ్ స్ఫూర్తితో హక్కుల కోసం దళితులంతా ఐక్యంగా పోరాడాలని దళిత సీనియర్ నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు, బుద్ధవిహార్ మహిళా అధ్యక్షురాలు వి.కృష్ణమూర్తి, కేవీపీఎస్ నాయకుడు ఎం.రాజశేఖర్, జనచైతన్య నాయకుడు పవన్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం ఇంద్రపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద భీమా కోరేగావ్ స్మారక స్థూపం వద్ద మృతవీరులకు ఘనంగా నివాళులర్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. పీష్వా బ్రాహ్మణులపై మహార్ పోరాట యోధుల యుద్ధ విజయానికి చిహ్నమే భీమా కోరేగావ్ అన్నారు. పలు సంఘాలకు చెందిన నాయకులు కేఎస్ శ్రీనివాసు, కె.సింహాచలం, భయ్యా రాజేంద్రప్రసాద్, వీవీ సత్యనారాయణమూర్తి, బి.కామేశ్వరరావు, పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపురం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని వేళ్లచింతలగూడెంలో నిర్వహించే టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఘంటా రంగారావు మధుకృష్ణ ఫౌండేషన్ సంస్థ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా ఈ గ్రామంలో నిర్వహించే క్రికెట్ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.లక్షా 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.30 వేలుగా అందజేయనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ దరఖాస్తులను ఈనెల 5వ తేదీ లోగా ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ సభ్యులకు అందజేయాలన్నారు. ఎంట్రీ ఫీజును రూ.5 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గత క్రీడాకారులు 9494943434 నంబరులో సంప్రదించాలని సూచించారు.